క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు గీతాంజలి

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండె జబ్బులతో పడిపోయే వ్యక్తులకు ఏ విధంగా సీపీఆర్ చేయాలో వివరించారు. ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులకు అవగాహ న కల్పించారు. వైద్యాధికారి గీతాంజలి, ఎస్సై గణేశ్, హెచ్ ఈవో యాదగిరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఆహారపు అలవాట్లతోపాటు జీవనశైలిలో వచ్చే మార్పులతో గుండెనొప్పి వస్తుందని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మండలంలోని వైశ్యభవన్‌లో సీపీఆర్‌పై (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శరణ్య గుండెనొప్పి వస్తే సీపీఆర్‌తోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు, ఆటోడ్రైవర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వెంకటరమణ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపు కోసం రాజన్నకు కోడె మొక్కు



వేములవాడఅర్బన్: సర్దార్ రవీందర్ సింగ్ ఎమ్మెల్సీగా గెలవాలని శాతావాహన జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య వేములవాడ రాజన్నకు గురువారం కోడె మొక్కు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులను కలుస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు సర్దార్ రవీందర్‌సింగ్‌కు ఓటు వేయాలన్నారు. అరుణ్‌కుమార్, సత్యనారాయణ, శ్రావ న్, మహేశ్, అశోక్,సుధీర్ తదితరులు ఉన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌గౌడ్

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ గౌడ సంఘం అధ్యక్షుడిగా బాదవేని శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సమావేశంలో గౌడ సంఘం ఎన్నికను నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా జిల్లెల్ల మల్లేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కోల పర్శరాములుగౌడ్, కోశాధికారులుగా రవిగౌడ్, పర్శరాముగౌడ్, కార్యదర్శులుగా అంజాగౌడ్, మద్దికుంట శ్రీనుగౌడ్, శ్రీధర్‌గౌడ్, మైసాగౌడ్ ఎన్నికయ్యారు.

వరి కొయ్యలు కాల్చొద్దు



బోయినపల్లి: రైతులు వరి కొయ్యలు కాల్చవద్దని ఎంఏవో కే.ప్రణీత పేర్కొన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో పంటల నమోదులో భాగంగా వరి కోతలు పూర్తిచేసిన చేలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వరి కొయ్యలకు నిప్పు పెడితే భూసారం దెబ్బతినడంతో పాటు, పంటల దిగుబడి తగ్గుతుందని తెలిపారు.


డ్రైనేజీలు శుభ్రంచేసిన సిబ్బంది

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో డ్రైనేజీలను గ్రామ పంచా యతీ సిబ్బంది గురువారం శుభ్రం చేశారు. గ్రామంలోని పలు వీధుల్లో 'పేరుకుపోతున్న చెత్త' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎంపీడీవో సత్తయ్య పంచాయతీ కార్యదర్శి జాఫర్‌ను మురికి కాలువలు శుభ్రం చేయాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు.

అదుపుతప్పి కారు బోల్తా

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట–రాచర్లగొల్లపల్లి గ్రామాల మధ్య గురువారం అదుపుతప్పి కారు బోల్తాపడింది. రాజన్నపేటకు చెందిన ఉడుగుల తేజా రాజన్నపేట నుంచి రాచర్లగొల్లపల్లికి కారు వెళ్తుండగా అతివేగంతో అదుపుతప్పి పల్టీలు కొట్టింది. పత్తి చేన్లలోకి దూసుకువెళ్లింది. ప్రమదంలో తేజా గాయపడగా సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గుంతలరోడ్లపై ప్రయాణమెలా ?

- మండలంలో అధ్వానంగా రోడ్లు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, గంభీరావుపేట తదితర మండలాల్లోని గ్రామాల రోడ్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని వివిధ రూట్లలో సుమారు 11 రోడ్లపై అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కనీసం మరమ్మతు పనులు కూడా చేయడం లేదు. గుంతలరోడ్లపై ప్రయాణంచేసే వారిలో 75 శాతం మంది నడుం నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్తున్నారు. వెన్నుపూస కదలడం, డిస్క్, పక్కటెముకలు, మోకాళ్లు, మెడలు పట్టుకోవడం వంటి సమస్యలతో బాధపడుతూ ఇక్కట్లు పడుతున్నారు.

పలుసార్లు విన్నవించినా..

మండలంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి అధికారులకు ఆదేశాలు జారీచేయాలని, నిధులు మంజూరు చేయించి ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్– బండలింగంపల్లి గ్రామాల మధ్య గుంతలరోడ్డు. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రోడ్డు భారీ వర్షాలకు గుంతలమయంగా తయారైంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులకు నరకప్రాయంగా మారి వాహనాలు పాడవుతున్నాయి. ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు ఒంటి నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఒక్క ఈ రోడ్డు మాత్రమే కాదు మండలవ్యాప్తంగా పలుప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది.

మరమ్మతు చేపట్టాలి



రోడ్లు గుంతలమయంగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. ఆటో తరచూ రిపేర్‌కు వస్తుంది. నడుం నొప్పితో కూడా బాధపడున్నాం. గర్భిణులు, వృద్ధులను ఆస్పత్రులకు తరలించే సమయంలో ఇక్కట్లు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– దానియల్, ఆటో డ్రైవర్, ఎల్లారెడ్డిపేట

జాగ్రత్తలు తీసుకోవాలి

తరచూ ప్రయాణం చేసే వారిలో డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి. ఎంఆర్‌ఐ లాంటి పరీక్షలకు కరీంనగర్ తరలిస్తున్నాం. తరచూ ప్రయాణించే వారు మెడ, నడుం బెల్టులు పెట్టుకోవాలి. నొప్పుల ఉపశమనానికి ఫిజియోథెరపీకి పంపిస్తున్నాం. ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

– సునీల్, ఆర్థోపెడిక్, ఎల్లారెడ్డిపేట

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



కోనరావుపేట: పల్లిమక్తలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



చందుర్తిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పల్లిమక్తలో మర్తనపేట, నాగారం, సుద్దాలలోని పలువురికి మంజూరైన రూ.15 లక్షల విలువైన 44 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, నాయకులు నాయిని ప్రభాకర్ రెడ్డి, వెంకన్న, కచ్చకాయల ఎల్లయ్య శ్రీనివాస్, ప్రభాకర్, నాగేందర్, భూషణంచ, భాస్కర్‌రావు, సంజివ్, ఉప్పుల గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలకేంద్రంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి గురువారం పంపిణీ చేశారు. రూ.2.60లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు ఆయన వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, నాయకులు పులి సత్తయ్య, లింగంపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలం అల్మాస్‌పూర్‌లో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఇక్కడ నాయకులు పిల్లి కిషన్, పెద్దూరి శ్రీనివాస్, కమలాకర్‌రెడ్డి, బీపేట లింగయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులున్నారు.

మంత్రి పొన్నంను కలిసిన మధుకర్

తంగళ్లపల్లి: రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం హుస్నాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ (ఛోటు) కలిశారు. జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఛోటు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బోయినపల్లి: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో నర్సింగాపూర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆటపాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష, పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ ముత్యాల ప్రభాకర్‌రెడ్డి ఫొటో–వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కాగా గురువారం ఆయనను ఆత్మీయులు ఘనంగా సన్మానించారు. దుంపెన రమేశ్, వంగ గిరిధర్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, శ్యామంతుల అనిల్‌కుమార్ తదితరులున్నారు.

48 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్



తంగళ్లపల్లిలో పట్టుకున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారు నుంచి అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో తంగళ్లపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు నిర్వహించిన దాడులలో 48 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న గాండ్ల నితిన్, సముద్రాల ప్రశాంత్, గుగులోత్ అంగుర, పాండు, రాజు, ప్రశాంత్‌లపై కేసు నమోదుచేసి, మినీవ్యాన్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై రామ్మోహన్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిరుపతి, మహిపాల్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

● ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలి



సిరిసిల్ల అర్బన్: క సినిమా, ప్రమోషన్‌ను చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కిరణ్ అబ్బవరం అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 'క' సినిమా శుక్రవారం పట్టణంలోని విమల్ థియేటర్‌లో రానుందని, ఆదివారం చిత్ర యూనిట్ ప్రమోషన్ కోసం రానున్నట్లు తెలిపారు. నిమ్మల ప్రశాంత్, తాళ్లపల్లి లక్ష్మణ్, మామిడాల మహేశ్, గడ్డమీది భాను, లకావత్ సంతోష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● స్కావెంజర్లను నియమించాలి

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలోని కుసుమ రామయ్య పాఠశాలలో శానిటేషన్ పనులు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల ముందు ధర్నా చేపట్టి మాట్లాడారు. పాఠశాలలో టాయిలెట్స్ నుంచి తరగతి గదుల్లోకి దుర్వాసన వస్తుందని, మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శుభ్రం చేసేందుకు స్కావెంజర్లు లేకపోవడంతోనే విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. పలుసార్లు ప్రధానోపాధ్యాయుడు, జిల్లా అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. నాయకులు ప్రణయ్, బన్నీ, అరవింద్, రాహుల్ పాల్గొన్నారు.

● మరమ్మతులు చేపట్టాలి

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో పెట్రోల్ బంక్ పరిసరాల్లో ఏర్పడిన కయ్యకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. కయ్య పడ్డ ప్రదేశాన్ని గురువారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. ఆయన వెంట రామంచ అశోక్, రాజశేఖర్, సదానందం ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలి

కోనరావుపేట: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే ద్వారా రేషన్ కార్డులేని ప్రతి కుటుంబానికి ముందుగా రేషన్ కార్డులు ఇవ్వాలని ధర్మసమాజ్ పార్టీ మండల బాధ్యుడు అమర్ మహారాజ్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం మాట్లాడారు. చాలామంది కుటుంబ సభ్యుల పేర్లు రేషన్‌కార్డులో లేక ఇబ్బంది పడుతున్నారని, వారి పేర్లు కూడా రేషన్ కార్డులో చేర్చాలన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మంజూరు చేయడం లేదన్నారు. రేషన్ కార్డులో పేరు నమోదుకాకపోవడంతో నిరుపేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని వాపోయారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.

● లక్ష్యసాధనకు కృషిచేయాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణు డు శివకుమార్ అన్నారు. మండలంలోని నా రాయణపూర్, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పది పరీక్షలపై లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోట సతీశ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. లయన్ సభ్యులు పయ్యావుల రా మచంద్రం, నాయిని భాస్కర్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, పాటి దేవయ్య, పెంజర్ల దేవయ్య, గొర్రె మల్లేశ్, పెంజర్ల రవి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఆరుబయటే విద్యార్థుల స్నానాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారు వేములవాడ మైనార్టీ గురుకుల పాఠశాలలో బోరు చెడిపోయింది. నీటి కొరతతో విద్యార్థులకు ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించారు. దీంతో పాఠశాల ఆవరణలో స్నానాలు చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా అధికారులకు తెలిపామని, గురువారం మధ్యాహ్నమే బోరు మోటార్‌కు మరమ్మతు చేయించగా నీటి కొరత లేదన్నారు.

● మానేరు వాగు శుభ్రం

తంగళ్లపల్లి: గండిలచ్చపేట గ్రామపంచాయతీ అధికారులు నిరూపించారు. మండలంలోని గండిలచ్చపేట గ్రామపంచాయతీ పరిధిలోకి మానేరు వాగు కూడా హద్దుగా ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వాగులో చెత్త వేస్తున్నారు. దీంతో వంతెన పక్కన వాగు చెత్తమయంగా మారిందని గుర్తించి గ్రామ పంచాయతీ అధికారులు వాగులోని చెత్త మొత్తం తొలగించారు. పంచాయతీ కార్యదర్శి వాణి మాట్లాడుతూ మానేరు వాగును శుభ్రంగా ఉంచుకోవాలని, ఎవరూ వాగులో చెత్తను వేయవద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

● వాహనాల తనిఖీ

వీర్నపల్లి: మండలంలోని వీర్నపల్లిలో హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలని, మద్యంతాగి వాహనాలు నడపవద్దని సూచించారు. సిబ్బంది తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

● కులగణనకు సహకరించాలి

బోయినపల్లి: ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో కుర్మ సామాజిక వర్గం సహకరించాలని జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య కోరారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల గణనకు అధికారులు ఇళ్లలోకి వచ్చినపుడు కులం వద్ద బీసీ (బీ) కురుమ అని స్పష్టంగా రాయించాలన్నారు. కురుమలు రాజకీయ, విద్యాపరంగా ఎదగడానికి కుల గణన మంచి అవకాశమన్నారు. సమావేశంలో వేములవాడ పట్టణ కుర్మ సంఘం అధ్యక్షుడు గుంటి కనుకయ్య, జోగాపూర్ మాజీ ఎంపీటీసీ గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు శిక్షణ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కే.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అందరూ ఎన్యుమరేటర్లు ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.



రుద్రంగి: మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులో కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టర్‌కు చేసిన బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలోనే వదిలేశారు. భవన నిర్మాణానికి తీసుకువచ్చిన మెటీరియల్ మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబోసే స్థలంలో ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : సత్యనారాయణ, మార్కెట్ సెక్రటరీ, రుద్రంగి. ఫోన్‌నంబర్ 7330733328

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

శాస్త్రీయ విజ్ఞానం పెంచేందుకు కృషి



బోయినపల్లి: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రామరాజు

బోయినపల్లి: సమాజంలో శాస్త్రీయ విజ్ఞానం పెంచేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జన విజ్ఞాన వేదిక సంస్థ ఉమ్మడి జిల్లా వ్యవస్థాపకుడు సీ. రామరాజు పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి హైస్కూల్‌లో గురువారం పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి, శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెడ్‌మాస్టర్ తిరుపతి, నర్సయ్య, డీ. శ్రీహరి తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నవయసు నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బూర రవీందర్, సీనియర్ సైన్స్ టీచర్ డి.మనోహర్, రవి, రఘుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి పారం లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో పీడీ హమీద్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి, గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ ఆదర్శ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నాగిల్ల రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ పాఠశాలల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అలాగే మండల స్థాయి పరీక్ష ఈనెల 21న నిర్వహిస్తామని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక మండల ఇన్‌చార్జి కులేరి ప్రేమ్‌సాగర్, మండల విద్యాధికారి శ్రీనివా స్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శులు సమయపాలన పాటించాలి



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట: గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన పి.విజయలక్ష్మిని ఆయన సన్మానించి రూ.1116 అందించారు. అనంతరం మండలంలోని గాలిపెల్లి, ఇల్లంతకుంట, దాచారం, వల్లంపట్ల, పలు గ్రామాలకు చెందిన 50 మందికి రూ. 132,6,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలపంచాయతీ అధికారి శ్రీనివాస్, వినయ్‌కుమార్, పసుల వెంకటి ,జెట్టి మల్లేశం, కరుణాకర్ రెడ్డి, పలుగ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణానికి చెందిన ఆడెపు గంగాధర్ గతేడాది విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందాడు. సెస్ సంస్థ నుంచి రూ.5లక్షల పరిహార చెక్కు మంజూరుకాగా గురువారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ నామాల ఉమా, సెస్ ఏఈ సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం



సరళ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన కంఠం సరళ (34) అనే వివాహిత గురువారం అదృశ్యమైంది. సరళ తండ్రి నర్సయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. సరళకు 2013లో అదే గ్రామానికి చెందిన ఉదయ్‌తో వివాహమైంది. ప్రస్తుతం దంపతులిద్దరూ తల్లిగారింట్లోనే ఉంటున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో వంట విషయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సరళ ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టు పక్కల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 15 వరకు కొనసాగుతాయని, 13న కల్యాణం, 15న రథోత్సవం ఉంటుందని వివరించారు. స్వామి వారి కల్యాణానికి రావాలని ఆహ్వానించారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, నాయకులు గంట వెంకటేశ్‌గౌడ్, సద్ది లక్ష్మారెడ్డి, పందిర్ల లింగంగౌడ్, గుండాడి రాంరెడ్డి, వంగ గిరిధర్‌రెడ్డి, చెన్నిబాబు, మెండే శ్రీనివాస్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



ఇల్లంతకుంట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ఇంటింటా అందేలా చూడాలని రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి అన్నారు. సోమారంపేట, ఆరెపల్లి గ్రామాల్లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.